క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి వెండి నాగపడగ సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి గుంటూరు జిల్లా కొల్లూరు మండలం యాదవపాలెం గ్రామస్తుడు డొక్కు శివసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు సుమారు రూ.65 వేల విలువగల 525 గ్రాముల వెండితో తయారు చేసిన నాగపడగను స్వామి వారికి కానుకగా సమర్పించుకున్నారు. శుక్రవారం ఉదయం ఆలయానికి చేరుకున్న వారు తొలుత స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం చేయించుకున్నారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావుకు స్వామివారి వెండి నాగపడగను అందజేశారు.

భక్తి శ్రద్ధలతో ఆదిశంకరాచార్య జయంతి

మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేట దత్తాశ్రమంలో శ్రీ సద్గురు గణపతి సచ్చిదానంద స్వామీజీ, శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీల ఆశీస్సులతో శుక్రవారం శ్రీ ఆది శంకరాచార్య జయంతి, సద్గురు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి మాతృమూర్తి జయలక్ష్మి మాత జయంతి కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ అత్రి వరద దత్తాత్రేయ స్వామికి, దత్త స్వామికి పంచామృతాల క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం జయలక్ష్మి మాతకు మాతృ మండలి ఆధ్వర్యంలో లక్ష మల్లెల పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగానే దత్తాత్రేయుని హోమాన్ని నిర్వహించి, మధ్యాహ్నం 12.30 గంటలకు పూర్ణాహుతి చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దత్త ఆశ్రమానికి విచ్చేసిన భక్తులందరికీ దత్త భిక్ష అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలలో కందప శివరామకృష్ణ. మునుకుట్ల శ్రీనివాస్, కపవరపు నాగవెంకట వరప్రసాద్, తల్లూరి శోభారాణి, తమ్మన సుబ్బారావు, మల్లది బుద్దేశ్వరరావు, చిన్నం గోవర్ధన, మాదిరెడ్డి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దశ సహస్ర తెల్ల జిల్లేడు పుష్పార్చన

నాగాయలంక: ఆర్ద్ర నక్షత్ర పర్వదినం పురస్కరించుకుని స్థానిక శ్రీరామపాదక్షేత్రంలోని శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలో శుక్రవారం ప్రదోష కాల సమయంలో స్వామి వారికి దశ సహస్ర తెల్ల జిల్లేడు పుష్పార్చన వైభవంగా జరిగింది. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్చకుడు సాయికిరణ్‌శర్మ పూజాదికాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ అపమృత్యు, పితృదోషాలు అనారోగ్య బాధలు నివృత్తి కాగలవని అన్నారు. పుష్పార్చనలో పాల్గొన్న మహిళలు తెల్లజిల్లేడు పూలును స్వయంగా రామలింగేశ్వరుని పుష్పార్చనలో సమర్పించారు. పూజ తదుపరి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఉప్పల లీలాకృష్ణప్రసాద్(బుజ్జి), తలశిల రఘుశేఖర్ పాల్గొన్నారు.

5న మండల కేంద్రాల్లో ధర్నాలు

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

మచిలీపట్నంటౌన్: ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 5వ తేదీన జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శీలం నారాయణరావు, పి.పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జ్యోతీరావు పూలే భవన్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పని చేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ ధర్నా కార్యక్రమాలకు పిలుపునిచ్చామన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని, చట్ట ప్రకారం 100 రోజుల పని కల్పించాలని, లేని పక్షంలో నిరుద్యోగ భృతి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త కార్మికులకు వెంటనే జాబ్ కార్డులు ఇవ్వాలని, ఉమ్మడి కార్డులో ఉన్న భార్యాభర్తలకు విడివిడిగా జాబ్ కార్డులు ఇవ్వాలని వారు కోరారు. కార్మికులకు పలుగు, పార ఇతర పని సామగ్రి, వేసవి అలవెన్స్ 40 శాతం కలిపి ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లతో చేపడుతున్న ధర్నాలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొని జయప్రదం చేసి డిమాండ్‌లను సాధించుకోవాలని వారు కోరారు.

పంటలకు జీవం.. రైతులకు లాభం

పీఎండీఎస్ విధానంతో బహుళ ప్రయోజనాలు

- ప్రకృతి వ్యవసాయంలో కీలక భూమిక
- నేలను సారవంతం చేసేందుకు ఉపయుక్తం
- పొదుపు సంఘాల ద్వారా విక్రయిస్తున్న అధికారులు



పీఎండీఎస్ కిట్లను తయారు చేస్తున్న పొదుపు సంఘాల సభ్యులు



విత్తనాలను శుద్ధి చేసి ఆరబెడుతున్న పొదుపు సంఘాల సభ్యులు

పెడన: ఇటీవల కాలంలో ప్రకృతి వ్యవసాయానికి డిమాండ్ పెరుగుతోంది. గత ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించింది. ఫలితంగా పెడన మండలంలో 165 మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. మరో 200 మంది రెండు రకాలుగానూ పంటలు వేస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పెసర మాత్రమే వేసి నేలను సారవంతం చేస్తూ వచ్చారు.

పీఎండీఎస్ కిట్.. 14 కేజీల బ్యాగు

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు పీఎండీఎస్(ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్) కిట్లను అందజేసేలా ప్రకృతి వ్యవసాయ విభాగం కృషి చేస్తోంది. ఎకరం వరి పంట చేలో 32 రకాల విత్తనాలు గల 14 కేజీలు గల పీఎండీఎస్ కిట్‌ను అందిస్తోంది. ఈ కిట్ల తయారీ, విక్రయం రెండూ పొదుపు సంఘాల ద్వారా చేయిస్తోంది. ఒక్కో కిట్ రూ.1000 చొప్పున విక్రయిస్తోంది. ఈ కిట్లో మినుములు, పెసర, బొబ్బర్లు, చిక్కుడు, నువ్వులు, ఆముదం, వేరుశనగ, దనియాలు, మెంతులు, ఆవాలు, రాగులు, మొక్కజొన్న, కొర్రలు, సాములు, జీలుగ, కట్టిజనుము, పిల్లపెసర, ఆకుకూరలు, దుంపజాతి, తీగజాతి వంటి విత్తనాలను శుద్ధి చేసి పిల్లిపెసర రెండు కేజీలు, జీలుగ రెండు కేజీలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. మిగిలిన పది కేజీలు 30 రకాల విత్తనాలను తీసుకుంటున్నారు.

వేర్లు ప్రధానం..

వీటిని పంట పొలాల్లో జల్లిన తర్వాత మొలకలు రాగానే వాటిని నేలలో దుక్కిదున్నడం ద్వారా నేల సారవంతమవుతుంది. వీటి వేర్ల వల్ల నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయి. నీటి సామర్థ్యం పెరుగుతుంది. నేల కోతకు గురికాకుండా ఉంటుంది. సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. కలుపు మొక్కల బెడద ఉండదు. స్థూల, సూక్ష్మ పోషకాలు ప్రధాన పంటకు అందుతాయి.

ఖర్చుల భారం తగ్గుతుంది..



ప్రకృతి వ్యవసాయం చేయడమే కాకుండా ప్రస్తుతం నేను ఫార్మర్ మాస్టర్ ట్రైనీగా విధులు నిర్వర్తిస్తున్నా. పలువురు రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిచేలా ప్రోత్సహిస్తున్నా. ఈ విధానం వల్ల ప్రారంభంలో దిగుబడి తక్కువగానే ఉంటుంది. రానురాను ఆ దిగుబడి బాగా పెరుగుతుంది.

– దేసు వెంకన్నబాబు, ఫార్మర్, మాస్టర్ ట్రైనీ, నందమూరు

మూడు గ్రామాలలో..



పెడన మండలంలో అచ్చయ్యవారి పాలెం, జింజేరు, నందమూరు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే వారున్నారు. ఇప్పటి వరకు 165 మంది రైతులు ఈ వ్యసాయాన్ని చేస్తున్నారు. పీఎండీఎస్ కిట్లను తయారు చేయడానికి పొదుపు సంఘాల వారిని కూడా ప్రోత్సహిస్తున్నాం. రైతు సంఘాలను ఏర్పాటు చేసి తద్వారా పీఎండీఎస్ కిట్లను అందజేస్తున్నాం.

– బి. వినుకొండ, ప్రకృతి వ్యవసాయ విభాగం, యూనిట్ ఇన్‌చార్జి, పెడన

358 రకాల పిండి వంటలు, పండ్లతో అమ్మవారికి నైవేద్యం



మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీ బొమ్మ శివాలయం ఆవరణలో ఉన్న శ్రీ అయ్యప్ప ఆలయ 34వ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలో శుక్రవారం మహిషాసుర మర్ధిని అమ్మవారికి భక్తులు 358 రకాల పిండి వంటలు, పండ్లతో నైవేద్యం సమర్పించారు. అమ్మ వారి అనుగ్రహం పొందుతూ దాదాపు వెయ్యి మంది మహిళా భక్తులు శ్రీ లలితా సహస్రనామ పారాయణాన్ని మూడు సార్లు చేశారు. ఆది శంకరాచార్య జయంతి సందర్భంగా శంకరాచార్యుల పూజ, స్తోత్రాలు, ప్రార్థన నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ భక్త బృదం ప్రతినిధులు పర్యవేక్షించారు.

అరకొర జనంతోనే తరలిన బస్సులు



అరకొర జనంతోనే పెడన నుంచి అమరావతికి బయలుదేరిన బస్సులు

పెడన: మెప్మా ఆర్పీలు...వెలుగు వీవోఏలు... ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు..ఫోన్లకు విరామం లేకుండా తమ తమ పరిధిలోని డ్వాక్రా గ్రూపు మహిళలకు, ఉపాధి కూలీలకు ఫోన్లు చేస్తూనే ఉన్నారు. రండి..త్వరగా రావాలి...బస్సు కదిలిపోతుంది....అంటూ అధికారులు ఫోన్లు చేస్తూ హడావుడి చేశారు. వీరి పక్కనే తెలుగు తమ్ముళ్లు కూడా వారిపై ఒత్తిడి తెస్తూ త్వరగా రావాలని సూచించారు. ఇదిగో..అదిగో వస్తున్నామంటూనే చాలా మంది రాలేదు. దీంతో వచ్చిన వారితోనే సర్దుకుపోయి వెళ్లిపోదామంటూ పార్టీ నాయకులకు నచ్చజెప్పి బయల్దేరి వెళ్లారు. దీంతో అరకొర జనంతోనే కొన్ని బస్సులు బయల్దేరాయి.

పేదలకు ఒక్క పైసా ఇవ్వలేదు.. మేం ఎందుకు రావాలి?

ఇప్పటివరకు పేద మహిళలకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు...మేం ఎందుకు రావాలంటూ మెప్మా ఆర్పీలు, వెలుగు వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద ప్రజలు అంటున్నారనే వాదనలు కూడా వినిపించాయి. తెలుగు తమ్ముళ్లు కూడా బస్సులు నిండకపోయేసరికి వారిలో వారు ఇదే విషయం మథనపడినా, పార్టీ నాయకుల వద్ద చెప్పుకోలేకపోయారు. పథకాలు అమలు చేసి రమ్మంటే వచ్చేవారని, పథకం రాదేమోననే భయం వారిని వెంటాడేదని తమ్ముళ్లే అనుకోవడం గమనార్హం.

జనం కోసం పడిగాపులు

చల్లపల్లి: నవ్యాంధ్ర రాజధాని అమరావతి పునఃప్రారంభ కార్యక్రమానికి చల్లపల్లి మండలానికి కేటాయించిన పది బస్సుల్లో జనాల కోసం నాయకులు శుక్రవారం ఉదయం పడిగాపులు పడ్డారు. ఉదయం 7 గంటలకల్లా బయలుదేరాలని బస్సులు ఏర్పాటుచేసిన అధికారులు జనం రాకపోవడంతో చాలా సేపటి వరకూ బస్సులు కదలలేదు. చివరికి బతిమాలి, బామాలి జనాల్ని తీసుకువచ్చి ఉదయం 9 గంటల తరువాత అమరావతికి పయనమయ్యాయి.

సమ్మెట ప్రసాద్ సేవలు ఆదర్శనీయం

అవనిగడ్డ: అమెరికన్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ (ఆప్త) నిర్వాహకుడు సమ్మెట ప్రసాద్ ఎందరో విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించారని విద్యావేత్త కొండవీటి ఈశ్వరరావు అన్నారు. స్థానిక నవజీవన్ విద్యాసంస్థల్లో శుక్రవారం ఆప్త వ్యవస్థాపకుడు సమ్మెట ప్రసాద్‌ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఆప్త సంస్థ నెలకొల్పి ప్రసాద్ ఎంతోమంది విద్యార్థులకు మంచి భవిష్యత్‌ని ఇచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు వి.శివనాగరాజు, సునీల్ పట్నాయక్, కోసూరి ధర్మప్రసాద్, నాదెళ్ళ ప్రసాద్, ఆర్.మల్లేశ్వరరావు, బడే ప్రభాకర్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

కోనేరుసెంటర్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకుంటామని, మచిలీపట్నం ఎక్సైజ్ ఎం.రామశేషయ్య హెచ్చరించారు. బందరు మండలం పోతేపల్లి గ్రామంలోని బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ఇరువురు యువకులను మచిలీపట్నం ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా రామశేషయ్య మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల మద్యం తాగడం వలన అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటిని అరికట్టేందుకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో గ్రూపులుగా ఏర్పడి మద్యం తాగే వారిపై చర్య తీసుకోవడంతో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్లకు వారిని అప్పగిస్తామని ఆయన హెచ్చరించారు. విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వై.శ్రీనివాస చౌదరి ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సొసైటీల్లో ఈ-ఆడిట్ ద్వారా పారదర్శకత

జిల్లా సహకార అధికారి చంద్రశేఖరరెడ్డి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఈ-ఆడిట్ ద్వారా పారదర్శకతకు అవకాశం కలుగుతుందని జిల్లా సహకార శాఖ అధికారి కె.చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఈ-ఆడిట్ విధానంపై కేడీసీసీ బ్యాంక్ కేంద్ర కార్యాలయంలో సహకార సంఘాల సీఈవోలు, సహకార శాఖ ఆడిటర్లకు శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 212 సహకార సంఘాల్లో మార్చి 31వ తేదీ నాటికి కంప్యూటరీకరణ పూర్తి చేశామన్నారు. కంప్యూటరీకరణ చేయటం ద్వారా సంఘాల్లోని లావాదేవీలన్నీ కంప్యూటర్ ఆపరేటర్లకు లాగిన్ ఏర్పాటు చేసి ఆ లాగిన్ ద్వారా ఎప్పటికప్పుడు నిర్వహిస్తామన్నారు. ఓచర్లు, రిసీప్ట్‌లు తదితర అంశాలన్నీ కంప్యూటర్ ద్వారా జరుగుతాయని దీనికి సహకార సంఘం సీఈవో లాగిన్ ద్వారా ప్రతిరోజు సంఘ లావాదేవీలను పరిశీలిస్తారన్నారు. ఈ కార్యక్రమాలన్నీ ఈ-ఆడిట్ ద్వారా ఎప్పటికప్పుడు సహకారశాఖలో ఉన్న ఆడిటర్లు వాటిని పర్యవేక్షించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేస్తారన్నారు. ఈ-ఆడిట్ ద్వారా పారదర్శకంగా సంఘ సభ్యులకు లావాదేవీలు నిర్వహించే అవకాశం కలుగుతుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎ.శ్యామ్‌మనోహర్, మాస్టర్ ట్రైనర్లు కోటేశ్వరరావు, శివశంకర్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభం

పెడన: పెడన సహాయ ఫౌండేషన్ వారు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం అభినందనీయమని మచిలీపట్నం ఇన్‌చార్జి ఉప విద్యాశాఖాధికారి బీఎస్‌సీ శేఖర్‌సింగ్ అన్నారు. పెడన సహాయ ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్ భాషా, ఉపాధ్యక్షుడు మామిడి ప్రసాద్, మహిళ విభాగం అధ్యక్షురాలు కోన వెంకటేశ్వరమ్మ, విద్యా విభాగం చైర్మన్ మట్టా రాధాకృష్ణమూర్తి, రౌతుల ప్రసాద్, తుమ్మల వరప్రసాద్, బట్ట దుర్గాశంకర్, సుమంత్, కంప్యూటర్ మాస్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ కిట్ల పంపిణీ

మచిలీపట్నంఅర్బన్: సమగ్ర శిక్ష జిల్లా పీసీ ఎం.ఫణిధూర్జటి ఆధ్వర్యంలో చిలకలపూడి పాండురంగ మున్సిపల్ హైస్కూలులో శుక్రవారం టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ కిట్లు (ఎంఆర్) పిల్లలకు పంపిణీ చేశారు. పిల్లల భవిష్యత్ కోసం మెటీరియల్ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఐఈ జిల్లా కోఆర్డినేటర్ రాంబాబు, ఏపీఓ ఏడుకొండలు, జిల్లా ఈఎం కోఆర్డినేటర్ సుభాన్, ఎస్ఐఈపీడీ టెక్నికల్ అసైన్‌మెంట్ నిపుణుడు రాకేష్, జిల్లా ఐఈఆర్పీలు, సీడబ్ల్యూఎస్‌ఎన్‌లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి సేవలు మరువరానివి

మచిలీపట్నంఅర్బన్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 38 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో ఉద్యోగ విధులు నిర్వహించిన శ్రీనివాస్‌రెడ్డి సేవలు మరువరానివని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాస్‌రెడ్డి వీడ్కోలు సభ శుక్రవారం స్థానిక జీజీహెచ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి దంపతులను వైద్యులు, స్టాఫ్ నర్సులు, వైద్య, వైద్యేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డి.ఆశాలత, డెప్యూటీ సూపరింటెండెంట్‌లు జి.భానుమూర్తి, శ్రీనివాసరావు, ఆర్ఎంఓ నిరంజన్‌కుమార్, జీజీహెచ్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

5 వరకు కాల్వలకు నీరు

బంటుమిల్లి: బంటుమిల్లి మండల పరిధిలోని గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా బంటుమిల్లి ప్రధాన కాల్వకు ఈనెల 5వ తేదీ వరకు నీటి సరఫరా జరుగుతుందని ఏఈఈ రాజేష్ తెలిపారు. కృష్ణాడెల్టాకు పులిచింతల ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీటిని శుక్రవారం నిలిపివేసినట్లు ఆయన వెల్లడించారు. ఎగువ నుంచి వస్తున్న నీటితో మరో మూడు రోజులు కాల్వలో నీటి సరఫరా జరుగుతుందని చెప్పారు. బంటుమిల్లి ప్రధాన కాల్వ పరిధిలో గ్రామాల్లో తాగునీటి చెరువులు, ఊర చెరువులను పూర్తి స్థాయిలో నింపుకొనేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

లోతు దుక్కులపై అవగాహన

కప్తానుపాలెం(మోపిదేవి): లోతు దుక్కులు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని ఘంటసాల కేవీకే శాస్త్రవేత్తల సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. మండలంలోని పెదప్రోలు శివారు కప్తానుపాలెంలో శుక్రవారం బాపట్ల కళాశాల విద్యార్థులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ వేసవికాలంలో చేపట్టాల్సిన లోతు దుక్కులు, మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. లోతు దుక్కుల వల్ల భూసారం పెరిగి నేలలో తేమ నిలుపుకొనే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. ఎస్ఎంఎస్ పంట ఉత్పత్తి డాక్టర్ ఎం.వెంకట లక్ష్మి మాట్లాడుతూ మట్టి నమూనా సేకరణ పద్ధతులను క్షేత్ర ప్రదర్శన ద్వారా చేసి రైతులు, విద్యార్థులకు చూపించారు. వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ బి.నవీన్, అభ్యుదయ రైతులు చంద్ర రామకృష్ణ, రావి సురేష్, గద్దె శ్రీహరి, జొన్నలగడ్డ పిచ్చేశ్వరరావు, బొందలపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఆలయభూమిలో మట్టి తవ్వకం



గూడూరు: అనుమతులు లేకుండా ఆలయ భూముల్లో మట్టి తోలకంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కంకటావ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటాచల వేణుగోపాల స్వామి ఆలయానికి గ్రామంలో పెద్ద ఎత్తున భూములు ఉన్నాయి. స్థానిక రైతులు వీటిని కౌలుకు సాగు చేస్తుంటారు. ప్రధానమంత్రి అమరావతి పర్యటన నేపథ్యంలో రెవెన్యూ అధికారులకు విధులు కేటాయించారు. మరో వైపు ఆలయ ఈఓ తన కుమారుడి వివాహ పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మట్టి మాఫియా గత రెండు రోజులుగా పొలాల్లో మట్టి యథేచ్ఛగా తవ్వకాలు జరిపి మట్టిని అమ్ముకుని అందిన కాడికి దండుకుంటున్నారు. దేవాలయ భూమిలో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.